'ఏటీసీ'ని సద్వినియోగం చేసుకోవాలి



దృశ్యసమీక్షలో కలెక్టర్ మనుచౌదరి, అధికారులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: అర్హత, ఆసక్తి కల్గిన విద్యార్థులు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో అధునాతన కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఇప్పటికే కుకునూరుపల్లిలోని ఐటీఐ ప్రాంగణంలో అదనంగా అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కార్మిక, ఉపాధికల్పన, శిక్షణ మరియు ఫ్యాక్టరీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్, శాఖ డైరెక్టర్ కృష్ణఆదిత్యతో కలసి కేంద్రాల్లో ప్రవేశాల ప్రక్రియ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్యసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడారు. ఏటీసీలో ఈనెల 30 వరకు దరఖాస్తుల గడువు పొడగించినట్లు తెలిపారు. ఒక్కో కేంద్రానికి 172 మంది నిర్దేశిత లక్ష్యంతో విద్యార్థులను చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ వెంకటరమణను ఆదేశించారు. అధికారులు రాఘవేందర్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి.. కలెక్టర్లతో దృశ్యసమీక్ష నిర్వహించారు. గ్రూప్-2, 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: సీపీ



మొక్క నాటుతున్న సీపీ అనూరాధ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: గంజాయి, మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై విధులు నిర్వర్తించాలని సీపీ అనూరాధ సూచించారు. సిద్దిపేట గ్రామీణ ఠాణా సర్కిల్, గ్రామీణ ఠాణాను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గురించి, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏసీపీ మధు, సీఐలు శ్రీధర్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. కార్యాలయ ఆవరణలో సీపీ మొక్కనాటి నీరు పోశారు.

అసాంఘిక పనులు.. తీసుకోవాలి చర్యలు



ఆలయ సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్

వర్గల్, న్యూస్‌టుడే: నాచారం గుట్ట ఆలయ సమీపంలోని కొన్ని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి దైవదర్శనానికి వచ్చి రాత్రుళ్లు భక్తులు బస చేస్తే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం నాచారం, వేలూరు, అనంతగిరిపల్లి శివారులను ఆనుకొని ఉంది. ఆయా గ్రామాలకు చెందిన కొందరు ప్రైవేటు గదులను అద్దెకు ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. వారు ఒకవైపు భక్తులకు మరోవైపు అసాంఘిక కార్యకలాపాల వారికి అద్దెకు ఇస్తుండటంతో గుడి పవిత్రతతకు భంగం కలుగుతోంది. రెండేళ్ల క్రితం ఆలయ సముదాయంలో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటైంది. ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు. స్థానికంగా నివసించే ప్రజలకు అసాంఘిక పనుల చర్యలతో బయటకు రాలేని పరిస్థితులు ఉంటున్నాయి. పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని పవిత్రతకు భంగం కలిగించే చర్యలను నిలువరించాలని భక్తులు కోరుతున్నారు. నిరంతరం నిఘా ఉండాలని చెబుతున్నారు. చుట్టుపక్కల ఉండే పంట పొలాల్లో మందుబాబులు మద్యం సీసాలను పగులగొట్టి పారేస్తున్నారు. రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు.

ప్రశాంతంగా ఉండలేకపోతున్నాం
– వై.కుమార్, వేలూరు

ఆలయం చుట్టూ ప్రైవేటు గదుల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రశాంతంగా బయట తిరిగే పరిస్థితి లేదు. దూరప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ఇక్కడ ఒకరోజు ఉండాలన్నా ఇబ్బందిగా మారింది.

నిరంతరం పర్యవేక్షిస్తాం:
– కరుణాకర్‌రెడ్డి, ఎస్ఐ, గౌరారం

అవుట్‌పోస్టులో నిరంతరం పోలీసులు విధుల్లో ఉండేలా చూస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సిబ్బందిని పెంచి నిరంతరం పర్యవేక్షించేలా చూస్తాం. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటాం.

విపణుల ఆదాయం అదరహో!

ఆర్నెల్లలోనే సగానికి పైగా సమకూరింది



గజ్వేల్ మార్కెట్‌లో ఉత్పత్తుల కొనుగోళ్లు

న్యూస్‌టుడే, గజ్వేల్: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లకు ఈ సారి ఆరు నెలల్లో ఆదాయం భారీగా సమకూరింది. వార్షిక ఆదాయం మొత్తం రూ.35 కోట్లు కాగా ఇప్పటిదాకా రూ.24.95 కోట్లు ఖజనాలో జమ అయ్యాయి. అయినట్లు అధికారులు చెప్పారు. రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసే కేంద్రాలు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కొనుగోళ్ల మొత్తంలో చెల్లించే 1 శాతం ఫీజును మార్కెట్లు తమ ఆదాయంగా పరిగణిస్తాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14 మార్కెట్ కమిటీలున్నాయి. 3 లక్షల మంది ఏటా రెండు సీజన్లు కలిపి 8 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తుంటారు. జిల్లాలో ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్న పంటలు పండిస్తారు. దిగుబడులను ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపడుతుంది. ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి పంటలు కొనుగోలు చేసి ప్రభుత్వానికి సెస్సు చెల్లిస్తుంటారు. ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆదాయం ఆశాజనకంగా ఉంది.

విపణి	వార్షిక లక్ష్యం	ఆదాయం (రూ.లక్షల్లో)
హుస్నాబాద్	485.15	292.89
గజ్వేల్	478.56	224.75
చేర్యాల	396.02	393.41
సిద్దిపేట	384.04	258.15
వంటిమామిడి	278.92	118.43
బెజ్జంకి	222.01	218.87
దుబ్బాక	206.20	182.74
కోహెడ	204.01	114.11
కొండపాక	183.84	123.64
చిన్నకోడూరు	180.26	136.22
దౌల్తాబాద్	156.81	139.53
నంగునూరు	126.68	104.39
మిరుదొడ్డి	116.59	119.28
తొగుట	81.18	69.19



భక్తిశ్రద్ధలతో భావానంద భారతి స్వామి జయంతి

ములుగు, న్యూస్‌టుడే: మర్కూక్ మండలం పాండురంగాశ్రమంలో శుక్రవారం యతివర భావానంద భారతి స్వామి 125వ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామికి పల్లకీ సేవ, క్షేత్ర ప్రదక్షిణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని హరినామస్మరణ చేశారు. గురుపాదుకా పూజ, సమాధికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెచ్చిన 56 రకాల మధుర పదార్థాలు ఛప్పన్ భోగ్ నివేదించారు. డోలోత్సవం నిర్వహించి అన్నదానం చేశారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి: పీఆర్టీయూ



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

న్యూస్‌టుడే, సిద్దిపేట, దుబ్బాక: విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయులు, విద్యార్థుల శ్రేయస్సుకు ప్రణాళికాయుతంగా కృషి చేయనున్నట్లు పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల, బాలుర, ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి నేతృత్వంలో హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మద్దతుగా నిలవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియను సందర్శించారు. వంగ మహేందర్‌రెడ్డిని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్వామి కోరారు. దుబ్బాక మండలంలోని లచ్చపేట, పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఓటర్ నమోదు ప్రక్రియతోపాటు అభ్యర్థి మహేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ ఎంపిక పోటీలు



ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మల్టీపర్పస్) మైదానంలో 68వ జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడాపోటీల ఎంపిక ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. 26 మండలాల నుంచి అండర్-14, 17 బాలబాలికలు సుమారు 2500 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి సౌందర్య పర్యవేక్షిస్తున్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. బహుమతులు, భోజనాలకు వీఎంఆర్ ఫౌండేషన్ అధినేత, పీఆర్టీయూ టీఎస్ అధికారిక ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి సహకరించారు. విజేతలు.. అండర్-14 ఖోఖో బాలికల విభాగం: కుకునూరుపల్లి (ప్రథమ), గజ్వేల్ (ద్వితీయ), జగదేవపూర్ (తృతీయ), అండర్-17 బాలికల విభాగం: జగదేవపూర్ (ప్రథమ), గజ్వేల్ (ద్వితీయ), కుకునూరుపల్లి (తృతీయ), అండర్-14 వాలీబాల్ బాలుర విభాగంలో రాయపోల్ (ప్రథమ), నారాయణరావుపేట (ద్వితీయ), నంగునూరు (తృతీయ) మండలాలు నిలిచాయి.

పని చేసిన వారికే పదవులు: కాంగ్రెస్

సిద్దిపేట అర్బన్: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికే పదవులు ఇవ్వాలని.. కొత్తగా వచ్చిన వారికి కట్టబెడితే సహించేది లేదని కిసాన్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి అన్నారు. సిద్దిపేటలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో నియామక పదవులు రాకపోవడానికి కారణం నాయకుల్లో ఐక్యత లేకపోవడమేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందన్నారు. నాయకులు రాజిరెడ్డి, ఎల్లవ్వ, రజని, చంద్రశేఖర్, సురేందర్, రాజశేఖర్ ఉన్నారు.

తోడూనీడ



భార్యాభర్తలు తోడూనీడగా ఉంటేనే చక్కని జీవితం. సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వృద్ధులైన భార్యాభర్తలు చేయి పట్టుకొని నెమ్మదిగా జాగ్రత్తగా రోడ్డు దాటుతూ కనిపించారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

నేడు విద్యుత్తు అంతరాయం

దుబ్బాక: సబ్ డివిజన్ పరిధిలోని హబ్షీపూర్ విద్యుత్తు కేంద్రంలో శనివారం మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏడిఈ గంగాధర్ శుక్రవారం తెలిపారు. దుబ్బాక పురపాలిక, మండలం, అక్బర్‌పేట- భూంపల్లి, మిరుదొడ్డి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

భవనంపై నుంచి పడి విద్యార్థినికి గాయాలు

చేర్యాల: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం (జనగామ జిల్లా నర్మెట మండలానికి చెందిన గురుకులం)లో ఏడో తరగతి చదువుతున్న బాలిక ప్రమాదవశాత్తు శుక్రవారం జారిపడింది. మొదటి అంతస్తులో దుస్తులు ఆరేస్తుండగా పడిపోయినట్లు తెలిసింది. బాలికను సిబ్బంది చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థిని సురక్షితంగా ఉందని, వైద్యం అందిస్తున్నట్లు సిద్దిపేట ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.



పోటీ.. సృజనాత్మకతతో మేటి

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

పోలీసు అమరుల సంస్మరణ ఉత్సవాల నేపథ్యంలో ఆ శాఖ పలు పోటీలకు తెర తీసింది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వేదికగా ఎంతో మంది చిన్న వీడియోలు, చిత్రాలు తీస్తూ తమ సృజనాత్మకతను చాటుకుంటుంటారు. ఇలాంటి వారి ప్రతిభను వెలికితీయడమే ధ్యేయంగా పోలీసు శాఖ ఈ పోటీలను నిర్వహిస్తోంది.

తాజాగా తీసినవి..

పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఆ శాఖ కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఫొటో, వీడియోగ్రాఫర్లు, విద్యార్థులతో పాటు పోలీసులకు పోటీలు చేపడుతోంది. పోలీసుల త్యాగాలను, విధుల్లో ప్రతిభను చాటేలా తాజాగా తీసిన 3 చిత్రాలు, 3 నిమిషాల నిడివి ఉన్న లఘుచిత్రాలను పెన్‌డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి పోలీసు శాఖ జిల్లా కార్యాలయంలోని



పీఆర్వోకు అందించాలి. వాటి నుంచి బాగున్నవి ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

ఏయే అంశాల్లో..

మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో రక్షకుల సేవ, ఇతర సందర్భాల్లో వారి కీర్తి ప్రతిష్ఠలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు ఇలా లఘుచిత్రాలకు అంశాలుగా నిర్దేశించారు. గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు తీసిన లఘుచిత్రాలను మాత్రమే పోటీలకు ఈ నెల 20 లోపు పంపించాల్సి ఉంటుంది.

అంతర్జాలంలో వ్యాసరచన

ఇంటర్ వరకు విద్యార్థులకు విచక్షణతో కూడిన చరవాణి వినియోగం, డిగ్రీ ఆపై వారికి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అంశాలపై అంతర్జాలం వేదికగా వ్యాసరచన పోటీలు ఉంటాయి. అక్టోబరు 25 లోపు పంపించాలి.

పోలీసు సిబ్బందికి..

కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్ఠ మెరుగుపరచడంలో నా పాత్ర, ఎస్సై నుంచి పై స్థాయి అధికారులకు దృఢమైన శరీరంలో దృఢమైన మనసు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో రాయవచ్చు.

త్యాగాలను స్మరిస్తూ..: అనూరాధ, సిద్దిపేట సీపీ



అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాం. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తాం.

ఫుట్‌బాల్‌లో రాణించేలా.. జాతీయస్థాయిలో ఆడేలా..

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడేలా తీర్చిదిద్దడమే ఇండియా ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్) లక్ష్యం. సాత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీతో కలిసి ఆటగాళ్ల ఎంపికకు పోటీలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో తొలిసారిగా ఈ నెల 19న మెదక్ ఇందిరాగాంధీ స్టేడియంలో మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపడుతోంది. హైదరాబాద్, ముంబయి, బెంగళూర్, కోల్‌కతా, చెన్నై, దిల్లీ వంటి ప్రధాన పట్టణాల్లోనే ఈ తరహా ఎంపికలు జరిగాయి. రాష్ట్రంలో మెదక్‌లో (శనివారం), వరంగల్‌లో (నవంబర్ 3న) జరగనున్నాయి.

శిక్షణ ఇచ్చి..

ప్రోత్సాహం లేక రాణించలేకపోతున్న పట్టణాలు, గ్రామాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో ఈ ప్రక్రియ చేపట్టారు. దేశంలోని ప్రముఖ అకాడమీల్లో తర్ఫీదు పొందవచ్చు. విదేశీ అకాడమీలలోనూ చేరవచ్చు.

ఎంపిక తీరు..

మూడు దశల్లో ఎంపికలు కొనసాగుతాయి. తొలి దశలో మెదక్, వరంగల్ జిల్లాల్లో పోటీలు జరుగుతాయి. ప్రతిభ చూపిన వారిని రెండో దశ రీజనల్ స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ పోటీలను బెంగళూర్‌లో నిర్వహించనున్నారు. మెరుగైన ఆట చూపిన వారిని మూడో దశ (జాతీయ స్థాయి)లో ఆడే అవకాశం దక్కుతుంది. ఇవి న్యూదిల్లీలో జరుగుతాయి.

తొలిసారిగా..



జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లను తీర్చిదిద్దే లక్ష్యంతో మూడేళ్లుగా ఐకేఎఫ్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు చేపడుతున్నాం. తొలిసారిగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వారికి సైతం ఈ తర్ఫీదు అందించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నాం.

విష్ణుతేజ, సాత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీ సహ వ్యవస్థాపకుడు, హైదరాబాద్

పారితోషికం..

శిక్షణ సమయంలో విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. పారితోషికం సైతం చెల్లిస్తారు. పలు క్లబ్‌లకు ఆడిస్తూనే, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఆడేలా తీర్చిదిద్దుతారు. ఉమ్మడి మెదక్, సమీపంలోని జిల్లాలకు చెందిన అండర్-13, 15, 17 బాలబాలికలు ఇందులో పాల్గొననున్నారు.



మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియం

సదవకాశం:

ఫుట్‌బాల్‌లో రాణించాలనుకునే వారికి సదవకాశం. ప్రముఖ అకాడమీలలో ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా శిక్షణ పొందే అవకాశం దక్కుతుంది. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడవచ్చు. **ప్రకాశ్, మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ శిక్షకుడు**


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



శంకర్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఎలుకపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ సాదాత్‌మియా తెలిపిన వివరాలు.. ఎలుకపల్లికి చెందిన కానికే శంకర్(22) తల్లి గతంలో మృతి చెందడంతో తండ్రి వెంకటేశ్.. దుర్గమ్మను పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో ఏడాది క్రితం వెంకటేశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ తన పినతల్లి దుర్గమ్మ వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సమస్యలపై దుర్గమ్మతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శంకర్ రాత్రి 11 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అన్ని చోట్ల వెతికినా జాడ దొరకలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉండడం గ్రామస్థులు గమనించారు. శంకర్ సోదరి శైలజ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.


కుటుంబ కలహాలతో మరొకరు..



రాజు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వల్లపు రాజు(35) కొన్నాళ్లుగా గుమ్మడిదలలో అద్దె ఇంట్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల కిందట ఆయనకు గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన లక్ష్మీతో రెండో వివాహమైంది. ఇటీవల కుటుంబ కలహాలు చెలరేగాయి. భార్యతో గొడవ జరగడంతో ఆయన మామ రాజు ద్విచక్ర వాహనం తీసుకెళ్లాడు. దీనికి మనస్థాపానికి గురైన రాజు శుక్రవారం మధ్యాహ్నం ఆయన సోదరుడు మహేశ్‌కు ఫోన్‌చేసి బాధగా మాట్లాడారు. తదుపరి పక్కింటి వారు ఫోన్‌చేసి రాజు ఇంట్లో ఉరి వేసుకున్నాడని చెప్పడంతో ఆయన సోదరుడు, తల్లి మల్లమ్మ వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



శివసాయి

మెదక్ రూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన పట్టణంలోని అవుసులపల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన నాగారం రాజయ్య, లక్ష్మి కుమారుడు శివసాయి(23) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటున్నాడు. రాజయ్య సుమారు 20ఏళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి పోషిస్తోంది. గురువారం రాత్రి తల్లి లక్ష్మి, ఆమె అక్క భర్త రవి, కుమారుడు శివసాయి మద్యం తాగారు. తర్వాత రవి వారి ఊరికి వెళ్లిపోయాడు. కొంతసేపటికి కుమారుడు లేడని చుట్టుపక్కల వారికి చెప్పి వెతికింది. రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూస్తే అతను గడ్డి పక్కన గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే స్థానికులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తల్లే చంపిందని బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. తల్లి, ఆమె అక్కపై గ్రామస్థులు దాడికి ప్రయత్నించడంతో పోలీసులు ఇద్దరినీ ఠాణాకు తరలించారు. కేసు నమోదైంది.

ప్రమాదవశాత్తు నీటమునిగి ఒకరి మృత్యువాత



గణేష్

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన ప్రకారం.. రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బేగరి గణేష్(45) రెండు రోజుల క్రితం బహిర్భూమికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. చెరువు వద్ద చూసినా ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం చెరువులో నీటిపై తేలింది. గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

వరికోత వాహనం ఢీకొని చిరువ్యాపారి..

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: వరికోత వాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా గుండారం గ్రామానికి చెందిన షేక్ ఆరీఫ్ గత ఏడాది ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నాడు. మంబోజిపల్లి మార్కెట్ వద్ద బజ్జీల బండి పెట్టుకుని కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. శుక్రవారం అక్కడే బండి పెట్టుకోగా వెనుక నుంచి వచ్చిన వరికోత వాహనం ఢీకొనడంతో కిందపడిపోయాడు. అతన్ని భార్య మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. డ్రైవర్ కాశ్మీర్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుల్తానా బేగం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గేదెను తప్పించబోయి రైతు దుర్మరణం

చిలప్‌చెడ్: గేదెను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి రైతు దారబోయిన వీరేశం(49)మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మిస్బోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరేశం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా చిట్కుల్ గ్రామ శివారులో దారిపైకి ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో దానిని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో వీరేశం తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు 120–00	డ్రెస్డ్ 206–00	
రిటైల్ 142–00	స్కిన్‌లెస్ 234–00	

మా ఊరికి మహాలక్ష్మి వచ్చింది!

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం గుడుపల్లి, ఔరంగ్ నగర్, గౌసాబాద్ తదితర గ్రామాల మీదుగా నడిచే ఆర్టీసీ బస్సు ఐదేళ్ల కిందట నిలిచిపోయింది. సరైన ఆదాయం రాకపోవడంతో సంబంధిత అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు కర్ణాటక రాష్ట్రానికి చెందిన బస్సు ఎక్కేవారు. లేదంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ క్రమంలో గురువారం జహీరాబాద్‌లో పర్యటించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డా. ఏ.చంద్రశేఖర్ మొగుడంపల్లి మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. జహీరాబాద్ డిపో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శుక్రవారం బస్సు సర్వీసును షురూ చేశారు. పద మూడు గ్రామాల ప్రజలకు ఊరట దక్కింది. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు రాకపోకలు సాగించనుంది. ఇక మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకునే అవకాశం చిక్కింది.



- న్యూస్‌టుడే, మొగుడంపల్లి (జహీరాబాద్ అర్బన్)

కాటేసిన కాలువ

ఆరు నెలల్లోనే నీటిలో పోయిన తండ్రి, కుమారుడి ప్రాణాలు



యాదగిరి

గజ్వేల్ గ్రామీణ: ఆరు నెలల క్రితం కుమారుడు కాలువలో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోగా.. ఇప్పుడు తండ్రి అందులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. వరుస విషాదాలతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. సీఐ సైదా తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దాతర్‌పల్లి- రిమ్మనగూడ మధ్యలోని కొండపోచమ్మ జలాశయం కాలువలో వ్యవసాయ కూలీ గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. దాతర్ పల్లి కి చెందిన నాయిని యాదగిరి (40)కి భార్య వాణి, కుమార్తె ఉన్నారు. యాదగిరి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం కాలువలో మృతదేహం తేలింది. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చాటుగా ప్రేమ వివాహం.. వరుడి ఇంటిపై దాడి

రాయపోల్, న్యూస్‌టుడే: ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిని పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం టెంకంపేటలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన యువకుడు (19), యువతి (20) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. అక్కడ వారికి పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరు కావడం, యువకుడికి చట్టప్రకారం పెళ్లీడు వయసు రాకపోవడంతో వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. ఈనెల 17న హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లి వివాహం చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రాయపోల్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరూ వచ్చారు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు.. వరుడి ఇంటికి వెళ్లి పెంకులు, రేకులు ధ్వంసం చేశారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

21న డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన



హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: డీసెట్ ర్యాంకు సాధించి పలు కారణాలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులకు ఈ నెల 21న హవేలిఘనపూర్‌లోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలో తిరిగి పరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు డైట్ ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. అభ్యర్థులు ర్యాంకుకార్డు, డైట్ సెట్ హాల్‌టికెట్, పది, ఇంటర్ మార్కుల మెమోలు, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు బోనఫైడ్లు, ఇంటిగ్రేటెడ్ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రత్యేక విభాగాల ధ్రువపత్రాలు (ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగులు, సైన్యంలో విధులు) తీసుకురావాలని సూచించారు. ఈ నెల 23 నుంచి 26 వరకు మీ సేవా కేంద్రాల్లో వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలని, వీలైనన్ని ఎక్కువ కళాశాలలు ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. 30న సీట్లు కేటాయిస్తామని, నవంబరు 3లోపు ప్రవేశం పొంది, ఫీజు చెల్లించాల్సి ఉంటుంది, 4న కేటాయించిన కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో చేరాల్సి ఉంటుందని వివరించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



మమత

పుల్కల్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందిన ఘటన చౌటకూరు మండల హొన్నాపూర్ వద్ద శుక్రవారం జరిగింది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపిన ప్రకారం మండలంలోని గంగోజిపేటకు చెందిన కాశపాగ మమత (30)కు ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. కొన్ని రోజులుగా భర్తకు దూరమై పుట్టింట్లో ఉంటోంది. సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్‌ఆర్ ఆసుపత్రి భోజనశాలలో హెల్పర్‌గా పని చేస్తోంది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి విధులకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. శుక్రవారం హొన్నాపూర్ జాతీయ రహదారి పక్కన శవమై కనిపించింది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరి పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పాములన్నీ ప్రమాదకరం కాదు



సర్పాన్ని ప్రదర్శిస్తూ వివరిస్తున్న ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సభ్యులు

ములుగు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ' ఆధ్వర్యంలో శుక్రవారం పాములపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విష సర్పాలు, విషంలేని సర్పాలను గుర్తించడం, పాము కాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అటవీ కళాశాల పరిశోధన కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎన్.ఎస్.శ్రీనిధి మాట్లాడుతూ సమాజంలో సర్పాలంటే అందరికీ ఎంతో భయం ఉంటుంది. పాములన్నీ ప్రమాదకరమైనవి కాదని, కొన్ని మాత్రమే విషపూరితమైనవన్నారు. అనేక రకాల సర్పాలు పంటలను నాశనం చేసే ఎలుకలు, ఇతర కీటకాలను తిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ పోటీల్లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుబ్బాక, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.బుచ్చిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆరు విభాగాల్లో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థులు ఎ.చామంతి ఏకపాత్రాభినయంలో, సీహెచ్ యశ్వంత్ వాద్య సంగీతంలో, క్రాంతి కుమార్ చిత్రలేఖనంలో ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గైడ్ టీచర్లను ఎంఈవో ప్రభుదాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

నలుగురిలో దూషించాడని.. మద్యం తాగించి మిత్రుడి హత్య



వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ శ్రీను, పక్కన మద్దూరు ఎస్సై మహబూబ్

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: మహిళలు సహా పలువురి ఎదుట అవమానకరంగా దూషించడంతో కోపం పెంచుకున్న మిత్రుడు కక్ష పెంచుకొని మద్యం తాగించి హత్య చేశాడు. సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం కూటిగల్ శివారులో ఈనెల 15న అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి (48) కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం మద్దూరు ఠాణాలో జరిగిన సమావేశంలో చేర్యాల సీఐ ఎల్.శ్రీను వివరాలు వెల్లడించారు. ఈనెల 14న బెక్కల్‌కి చెందిన బైరగోని లక్ష్మి మద్దూరు స్టేషన్‌లో తన భర్త యాదగిరి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ మరుసటి రోజే కూటిగల్ శివారులో యాదగిరి మృతదేహం లభ్యమైంది. హత్యకు గురైనట్లు నిర్ధారించుకొని మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి ఎస్సైలు మహబూబ్, నీరేశ్, రాజు ఆధ్వర్యంలో మూడు బృందాలు దర్యాప్తు చేశాయి. బైరాన్‌పల్లికి చెందిన నందనబోయిన బాలకృష్ణను అనుమానితుడిగా భావించి, అతని కోసం గాలిస్తుండగా శుక్రవారం మద్దూరు మండలం ఉప్పరోనిగడ్డ శివారులో పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈనెల 13న బెక్కల్‌లో అవమానిస్తూ యాదగిరి తిట్టడంతో బాలకృష్ణ కోపం పెంచుకున్నాడు. అంతుచూడాలని భావించిన బాలకృష్ణ.. అదే రోజు సాయంత్రం యాదగిరిని బైక్‌పై తీసుకెళ్లి మద్యం తాగించాడు. మత్తులో ఉండగా కర్రతో తలపై బాది హత్య చేశాడు. బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కేసు ఛేదించిన ఎస్సైలను, సిబ్బందిని సీఐ అభినందించారు. సీసీ కెమెరాలు ఉండటంతో కేసు ఛేదనకు తోడ్పడ్డాయని తెలిపారు.

బంగారు బాల్యానికి.. పంచసూత్రం!

అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యాచరణ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, తాండూరు

నేటి బాలలు.. రేపటి భావిభారత పౌరులు. బంగారు భవితకు బాటలు పడేది ప్రాథమిక దశలోనే. ఈ తరుణంలో వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆయా సేవలకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. వివిధ రూపాల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నా పోషణ లోపంతో పలువురు బాధపడుతున్నారు. వారిని సంపూర్ణ ఆరోగ్యులుగా తీర్చిదిద్దే క్రతువులో భాగంగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో చిన్నారుల అభ్యున్నతికి పంచసూత్రాల అమలుకు శ్రీకారం చుట్టడం విశేషం.

ప్రాజెక్టులు		అంగన్‌వాడీ కేంద్రాలు
సంగారెడ్డి	5	1,504
మెదక్	4	1,076
సిద్దిపేట	5	1,150
వికారాబాద్	5	1,107

మార్పు తీసుకొచ్చే లక్ష్యంతో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 9, వికారాబాద్ జిల్లాలో 5 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 4,837 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. చిన్నారులకు అధిక పోషకాలున్న బాలామృతం అందిస్తున్నారు. ఎవరికైనా పోషణ లోపం ఉంటే వారిని వైద్యుల వద్దకు తీసుకెళ్తున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తూ మార్పు తెస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాల వారిని గుర్తించి పూర్వప్రాథమిక స్థాయి విద్యను అందిస్తూ.. కావాల్సిన ఆహారం సమకూర్చుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పక్కాగా అమలుచేస్తున్నాం: లలిత కుమారి, జిల్లా సంక్షేమాధికారిణి, సంగారెడ్డి

చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పంచసూత్రాలు పక్కాగా అమలయ్యేలా చూస్తున్నాం. పోషణలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం.

పంచసూత్రాలు ఇలా..

1000 రోజుల ప్రణాళిక

జిల్లాల్లో పోషణ లోపం కలిగిన చిన్నారులపై ప్రత్యేక కార్యక్రమం. 1000 రోజుల పాటు ఇది కొనసాగుతుంది. చిన్నారుల్లో మార్పునకు అవసరమైన చర్యలు తీసుకుంటారు.

పౌష్టికాహారం తినడం

చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలకు పోషణలోపమే ప్రధాన కారణం. బాల్యదశలో సమతుల ఆహారం అందించకపోతే ఎదురయ్యే ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించడంతో పాటు ఇంటి వద్ద కూడా ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియజేస్తున్నారు.

రక్తహీనత నివారణ

పలువురు చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తుతోంది. ఇలాంటి వారిని గుర్తించి.. పౌష్టికాహారం అందిస్తారు.

డయేరియాకు దూరంగా..

కలుషిత నీరు, ఆహారం తదితర కారణాలతో చిన్నారులు డయేరియా బారినపడుతున్నారు. ఫలితంగా శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. నిర్లక్ష్యం వహిస్తే పరిస్థితి చేయిదాటే ప్రమాదం లేకపోలేదు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, ఒకవేళ అతిసారం బారినపడితే ముందడుగు వేయాల్సిన తీరుపై సూచనలు చేస్తున్నారు.

శుచి, శుభ్రత

శుచి, శుభ్రత పాటించకపోతే రోగాలు ప్రబలే ఆస్కారం ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికం. చేతుల శుభ్రతతో ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులు తరచూ చేతులను శుభ్రం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లి గ్రామానికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. తమతో ఉంటున్న భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి యావజ్జీవ ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు.

'అపార్'పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

వర్గల్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానంలో భాగంగా 'వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడెంటీ'పై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో సునీత పేర్కొన్నారు. అందుకోసం దేశవ్యాప్తంగా విద్యార్థుల కోసం రూపొందించిన అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం వర్గల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు దరికి అవగాహన కల్పించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కనకరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వస్తానంటే స్వాగతం పలుకుతాం: వంటేరు

గజ్వేల్, న్యూస్‌టుడే: మల్లన్నసాగర్ నిర్వాసితులకు భారాస ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడకగదుల ఇళ్లు, నివాస స్థలాలు, పాఠశాలలు, ఆలయాలతో పాటు కల్పించిన సౌకర్యాలను చూసేందుకు వస్తానంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వెయ్యి మందితో స్వాగతం పలికేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ నిర్వాసితులను కడుపులో పెట్టుకుని చూసిన భారాస సర్కారు 9,600 మంది బాధితులకు ఇళ్లు నిర్మించామన్నారు. మిగిలిన 400 మందికి సౌకర్యాలు కల్పించేందుకు కావాల్సిన రూ. 448 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరించాలన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రజాధనం వృథా చేసి దోచుకునేందుకు పథకం వేశారన్నారు.

పట్టుపడితే లాభాలే

● జిల్లాలో మల్బరీ సాగు పెంపునకు కృషి


న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్, గజ్వేల్: వ్యవసాయానికి అనుబంధంగా కొనసాగుతున్న పట్టుపురుగుల పెంపకం రైతులకు లాభాలను పంచుతోంది. మల్బరీ సాగుకు ముందుకొచ్చే రైతులకు రాయితీలు అందిస్తూ ప్రభుత్వం ఆ దిశగా ప్రోత్సహిస్తోంది. దీంతో అనేకమంది మల్బరీ సాగు చేపట్టి ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో పట్టుపురుగుల పెంపకానికి పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో సాగుపై అధికారులు దృష్టి సారించారు. మూడు, నాలుగేళ్ల నుంచి పట్టు సాగు విస్తీర్ణం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సాగు పెంపుదలకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై 'న్యూస్‌టుడే' కథనం..

అవగాహన కల్పిస్తూ..

జిల్లాలో ఇప్పటికే 1127 ఎకరాల్లో మల్బరీ సాగవుతోంది. 2024-25 సంవత్సరానికి గాను అధికారులు 200 ఎకరాల్లో సాగు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మల్బరీ సాగుపై పల్లెల్లో ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగుకు అవసరమైన మల్బరీ మొక్కలు సిద్ధంగా ఉండడంతో పనులు ముమ్మరం చేశారు. నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటికే 60 ఎకరాల్లో రైతులు మల్బరీ మొక్కలు నాటినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. పట్టుపురుగుల పెంపకంపై ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

పలు రకాల ప్రోత్సాహకాలు

మల్బరీ సాగు విస్తీర్ణం పెంచాలనే ఉద్దేశంతో కేంద్రం 'సిల్క్ సమగ్రా-2' పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా షెడ్ నిర్మాణం, మల్బరీ సాగు, చంద్రికలు, క్రిమిసంహారక మందులను రాయితీపై అందజేస్తుంది. షెడ్ నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ. 2,92,500, జనరల్, బీసీ రైతులకు రూ. 2.25లక్షల చొప్పున ఇస్తోంది. మల్బరీ సాగుకు జనరల్, బీసీలకు రూ. 60 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 78వేల చొప్పున అందిస్తోంది. పట్టుపురుగుల పెంపకానికి అవసరమైన చంద్రికలు, పురుగు మందులను 50శాతం రాయితీపై రైతులకు సరఫరా చేస్తోంది.



సాగవుతున్న మల్బరీ తోట

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

పట్టుపురుగుల పెంపకానికి ముందుకొచ్చే రైతులకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మల్బరీ సాగు పెంపునకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది. అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సాగు పెరిగేలా చర్యలు తీసుకుంటాం.

– ఇంద్రసేనారెడ్డి, జిల్లా పట్టుపరిశ్రమశాఖ అధికారి

రెవెన్యూ డివిజన్ సాధనకు ఐక్య పోరాటం



సంఘీభావం ప్రకటిస్తున్న ఐకాస నేతలు

చేర్యాల, న్యూస్‌టుడే: చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అన్ని వర్గాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని ఐక్య పోరాటం చేస్తామని చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన ఐకాస ఛైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ అన్నారు. స్థానికంగా ఓ వేడుక మందిరంలో ఐకాస వైస్ ఛైర్మన్ పుర్మ ఆగం రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత అస్తిత్వం కోసం ఎనిమిదేళ్లుగా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ఆందోళనలు చేపట్టినట్లు గుర్తుచేశారు. ఇప్పటికైనా మన ప్రాంత ఆత్మ గౌరవం కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. త్వరలో కార్యాచరణ రూపొందిస్తామని, అంతకుముందు సీఎంను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐకాస నాయకులు జీవన్‌రెడ్డి, అందె అశోక్, ఉడుముల భాస్కర్‌రెడ్డి, అందె బీరయ్య, యాదగిరి, రాజు, ఆపుధర్మ యాదయ్య, కౌన్సిలర్ ఆడెపు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీషరీఫ్



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో జామా మసీదు కమిటీ ఆధ్వర్యంలో గౌసెపాక్ గ్యార్వీ షరీఫ్ (జెండా పండుగ) నిర్వహించారు. శుక్రవారం గ్యార్వీ షరీఫ్ కార్యక్రమంలో భాగంగా గౌసెపాక్ జెండాను మసీదు నుంచి అలంగీర్ మసీదు వరకు తీసుకెళ్లి జెండా గద్దె వద్ద ప్రతిష్ఠించారు. మసీదులో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి అన్నదానం చేశారు. జామా మసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ బాషుమియా, ప్రధాన కార్యదర్శి హసన్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అయూబ్‌పాషా, ఎండీ దస్తగిరి, అఫ్జల్, షబ్బీర్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు, ప్రశంసా ప్రతాలు అందజేస్తున్న కరస్పాండెంట్ జగ్గు మల్లారెడ్డి

సిద్దిపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో సిద్దిపేటలోని కాకతీయ టెక్నో ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. అందులో భాగంగా 'అంతర్జాల వినియోగంతో కలిగే లాభ-నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశాలపై జరిగిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ప్రతిభ ఆధారంగా మొదటి మూడు స్థానాల్లో వరుసగా.. పదో తరగతి నుంచి ఎస్. విష్ణుప్రియ, ఎనిమిదో తరగతి - కె. మనస్విని, తొమ్మిదో తరగతి - ఎం. మహన్య నిలిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జగ్గు మల్లారెడ్డి, ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు.. విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు.

ఓయూ విశ్రాంత ఆచార్యుడి అకాల మరణం

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం విశ్రాంత ఆచార్యుడు వడ్డేపల్లి సత్యనారాయణ (60) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. గజ్వేల్‌లోని ఒక ప్రైవేటు యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ నియామకాల కోసం జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఉదయం 12.30 గంటలకు గుండెపోటు రావటంతో కుప్పకూలారు. ఆయనకు భార్య ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. జులైలో ఉద్యోగ విరమణ చేసిన ఆయన నాచారంలో ఉంటున్నారు. ఈ సందర్భంగా పలువురు సంతాపం తెలిపారు.

డీఏ బకాయిలు విడుదల చేయాలి: టీపీటీఎఫ్

సిద్దిపేట: పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ సీనియర్ నేత తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట, పరిసర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ గౌడ్, కృష్ణరాజేందర్, అశోక్‌రెడ్డి, రాజశ్రీ, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు సన్మానం

హుస్నాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కేడం లింగమూర్తిని స్థానిక టీజీఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం హుస్నాబాద్ డిపో పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం పక్షాన సత్కరించారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేసి మరింత ముందుకు సాగాలని కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు బత్తిని సాయిలు, అధ్యక్షుడు ముప్పిడి రాజిరెడ్డి, కార్యదర్శి అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యం తగదు: డీఎస్ఎస్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థుల ధ్రువపత్రాల జారీలో తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది జాప్యం చేస్తున్నారని దళిత సంఘర్షణ సమితి(డీఎస్ఎస్) రాష్ట్ర కార్యదర్శి కుంబాల రమేశ్ ఆరోపించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్దిపేట సమీకృత కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. డీఎస్ఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రం పరిశీలన

గజ్వేల్, న్యూస్‌టుడే: పాలిథీన్ వినియోగాన్ని తగ్గించి ప్రతి ఒక్కరు జ్యూట్ బ్యాగులను వినియోగించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య సూచించారు. ఇంద్ర మహిళా శక్తి స్కీమ్‌లో భాగంగా గజ్వేల్‌లో బ్యాంకు రుణాలు పొందిన స్వయం సహాయక బృందాలు నిర్వహిస్తున్న జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. మెప్మా సీవో సరిత, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం

చేర్యాల, న్యూస్‌టుడే: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు దోహదపడే ఉపకారవేతనాలు, బోధనా రుసుముల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం రోజుకో ప్రకటన విడుదల చేస్తూ జాప్యం చేస్తుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ వర్ధన్ అన్నారు. స్థానికంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొందరు పేద విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాజు, భాను, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట



సిద్దిపేటలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ దుర్గ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుకునే సమయాల్లో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని మహిళా పోలీసు ఠాణా ఇన్‌స్పెక్టర్ దుర్గ సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్‌కాల్స్, సందేశాలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మకూడదన్నారు. మహిళా రక్షణ చట్టాలు, గంజాయి, సైబర్ నేరాలపై సిద్దిపేటలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆమె అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఆస్మా ఫాతిమా, అధ్యాపకులు, షీటీమ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

గజ్వేల్ గ్రామీణ: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సీఐ సైదా సూచించారు. గజ్వేల్‌లోని నాగార్జున ఒకేషనల్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు.

'కొమ్మూరి చొరవతోనే వంతెన నిర్మాణం'

చేర్యాల, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతోనే కడవేర్గు శివారులో వాగుపై వంతెన నిర్మాణ పనులు మొదలయ్యాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వంతెన నిర్మాణ ప్రాంతంలో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వ కాలంలో పనులు చేపట్టలేదని, ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్యను మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా చేశారని తెలిపారు. నాయకులు ఆరుట్ల వినీత్, తాళ్లపల్లి రమేశ్, లింగారెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు రేపు అవగాహన సదస్సు

సిద్దిపేట: డీఎస్సీ-2024 ద్వారా నియమితులైన 256 మంది ఉపాధ్యాయులకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సర్వీసు రూల్స్, ఇతరత్రా అంశాలపై సిద్దిపేటలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.యాదగిరి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో రేపు ఉదయం 10 గంటలకు సదస్సు మొదలవుందని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు రాకేశ్, ఇస్మాయిల్, తదితరులు ఉన్నారు.

ఉపకార వేతనాలు చెల్లించాలి: బీజేవైఎం

హుస్నాబాద్, న్యూస్‌టుడే: విద్యార్థులకు రావాల్సిన బోధనా రుసుములు, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం పట్టణాధ్యక్షుడు రాజేందర్ ప్రభుత్వాన్ని హుస్నాబాద్‌లో కోరారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దుబ్బాక: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని డీసీసీ కార్యదర్శి ఏలూరి కమలాకర్ అన్నారు. శుక్రవారం దుబ్బాకలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేషనల్ కాంగ్రెస్ వారియర్స్ జిల్లా అధ్యక్షుడు గజభీంకార్ అశోక్‌తో కలిసి మాట్లాడారు. సంజీవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీల చోరీ

కొండపాక గ్రామీణం: కొండపాక మండల కేంద్రంలోని రెండు ఆలయాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీలు ఎత్తుకెళ్లారు. దొంగలు మొదట రవీంద్రనగర్‌లోని హనుమాన్ ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లి గ్రామశివారులో పగులగొట్టి అందులోని నగదును దొంగిలించారు. అనంతరం కొండపాక రుద్రేశ్వరాలయంలో హుండీని తీసుకెళ్లి గ్రామంలోని నల్లచెరువు సమీపంలో తెరవడానికి యత్నించి విఫలమవడంతో అక్కడే వదిలేశారు. శుక్రవారం ఉదయం చోరీలను గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఇదే విషయమై ఎస్సై శ్రీనివాస్‌ను అడగ్గా సమాధానం దాటవేశారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

జగదేవపూర్: మునిగడపలో రెండు వారాల కిందట జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. గజ్వేల్ గ్రామీణ ఎస్‌ఐ మహేందర్ రెడ్డి, జగదేవపూర్ ఎస్‌ఐ చంద్రమోహన్‌లు తెలిపిన వివరాలు.. మునిగడపకు చెందిన తలారి సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి వేరే గ్రామానికి వెళ్లారు. తిరిగొచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.25 వేల నగదు, అర తులం బంగారం చోరీకి గురైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. అదే గ్రామానికి చెందిన తుమ్మ నవీన్ చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు వారు తెలిపారు.

బడి నుంచి ఇంటికెళ్తున్న బాలికపై శునకాల దాడి

బెజ్జంకి, న్యూస్‌టుడే: పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న చిన్నారిపై కుక్కలు దాడిచేసి గాయపరచగా అడ్డుకున్న వ్యక్తికి గాయాలైన ఘటన శుక్రవారం చీలాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన గజ్జెల ప్రశాంత్, లాస్య దంపతుల కుమార్తె(5) రిషిక స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇటీవలే చేరింది. పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తుండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. చిన్నారి నడుము, కడుపు, చేతులపై గాయాలు కాగా కేకలు వేయడంతో సమీపంలోని పంచాయతీ కార్మికుడు సంతోష్ గమనించి అడ్డుకునేందుకు వెళ్లారు. అతనిపైనా దాడి చేయడంతో చేతులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి కుక్కలను తరిమికొట్టారు. గాయపడిన రిషికతో పాటు సంతోష్‌కు రక్తస్రావం కాగా బెజ్జంకిలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి అదృశ్యమైన ఘటనపై సిద్దిపేట గ్రామీణ ఠాణాలో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట పట్టణానికి చెందిన ఎండీ షాబుద్దీన్‌కు పదేళ్లుగా మానసిక స్థితి బాగోలేదు. ఐదేళ్ల నుంచి నుంచి సిద్దిపేట గ్రామీణ మండలం ఇర్కోడు దర్గా వద్ద ఓ గదిలో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 14న షాబుద్దీన్ సోదరుడు షకిల్ సైపుద్దీన్ ఇర్కోడు దర్గా వద్దకు వెళ్లి చూడగా షాబుద్దీన్ కనిపించ లేదు. కుటుంబీకులు పల చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. సైపుద్దీన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైకుంఠరథం అందజేత



వైకుంఠరథం వద్ద యాదగిరి, కుటుంబసభ్యులు

మిరుదొడ్డి: అక్బర్‌పేట-భూంపల్లి మండలం జంగపల్లి గ్రామ మాజీ సర్పంచి కంచం యాదగిరి ప్రజల వినియోగార్థం గ్రామపంచాయతీ అధికారులకు శుక్రవారం వైకుంఠ రథాన్ని అందజేశారు. భూంపల్లి ఎస్సై హరీష్, పంచాయతీ కార్యదర్శి సుమన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'హమాలీలకు సంక్షేమ బోర్డు అవసరం'

బెజ్జంకి: హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శశిధర్ శుక్రవారం బెజ్జంకిలో అన్నారు.

డయాలసిస్ బాధితులను ఆదుకోండి

బెజ్జంకి, న్యూస్‌టుడే: డయాలసిస్‌తో బాధపడుతున్న పేదలకు ప్రభుత్వం అండగా నిలిచేలా కృషి చేయాలని కోరుతూ శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం అందజేసినట్లు గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల సంపత్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ. 10వేలు పింఛను ఇచ్చేలా చూడాలని కోరారు. గల్ఫ్ మృతులకు ప్రభుత్వం రూ. 5లక్షలు పరిహారం ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

చేర్యాల ఏడీఈగా వెంకటేశ్‌గౌడ్

చేర్యాల: చేర్యాల సబ్ డివిజన్ విద్యుత్తుశాఖ సహాయ డిప్యూటీ ఇంజినీరు(ఏడీఈ)గా పి. వెంకటేశ్‌గౌడ్ నియామకమయ్యారు. పదోన్నతిపై వచ్చిన ఆయన శుక్రవారం విధుల్లో చేరారు.

'అందె భాస్కర్ స్ఫూర్తిగా రాణించాలి'



భాస్కర్‌తో ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి తదితరులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: డప్పు వాయిద్యంపై పీహెచ్‌డీ పూర్తిచేసిన మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పురస్కార గ్రహీత భాస్కర్‌ను సిద్దిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి, తెలంగాణ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం మాట్లాడారు. విద్యార్థులు భాస్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి దరిపల్లి నగేశ్, అధ్యాపకులు ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు శుక్రవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా తొమ్మిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ. 18,500 జరిమానా విధించారు.

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: మద్యం సేవించి వాహనాలు నడిపిన 31 మంది వాహన చోదకులకు రూ. 24,500 జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యుడీషియల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రియాంక శుక్రవారం తీర్పునిచ్చారని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు కూడళ్ల వద్ద వాహనాలు తనిఖీ చేయగా 31 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వారిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం.. స్తంభమే సాక్ష్యం



విద్యుత్తు సరఫరా మెరుగుదలకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. కొన్నిచోట్ల మాత్రం సిబ్బంది నిర్లక్ష్యం వల్ల స్తంభాలు, నియంత్రికల వద్ద తీగజాతి మొక్కలు పెరిగి తీగలను అల్లుకుంటున్నాయి. జగదేవపూర్ ప్రధాన రహదారి పక్కన ఠాణా పరిసరాల్లో జనసంచారం అధికంగా ఉండే ప్రాంతంలోనూ విద్యుత్తు స్తంభాన్ని తీగజాతి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై జగదేవపూర్ ట్రాన్స్‌కో ఏఈ శివశంకర్‌ను వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, జగదేవపూర్.

నిధుల దుర్వినియోగంపై విచారణేది?

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎల్లాయిపల్లి గ్రామపంచాయతీ(2019-2024) నిధుల దుర్వినియోగంపై డీపీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసి ఆరు నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు వాపోయారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్, డీపీవో కార్యాలయాల్లో శుక్రవారం మరోసారి ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి డబ్బులు రికవరీ చేయాలని నర్సింగ్, కొమురవెల్లి, శ్రీనివాస్, ఎల్లం, రామచంద్రం, తదితరులు డిమాండ్ చేశారు.

ఉత్సవ విగ్రహాల చోరీ

రాయపోల్: పెద్దమ్మగుడిలో చోరీ జరిగిన ఘటన రాయపోల్ మండలం ఆరేపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. రాయపోల్ ఏఎస్‌ఐ రాజు తెలిపిన వివరాలు.. పెద్దమ్మ ఆలయంలో కొంతకాలంగా కాశమైన యాదయ్య, అండాలమ్మ దంపతులు ఆలయ సేవకులుగా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగా గురువారం పూజలు నిర్వహించి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం గుడి తాళాలు తీసి ఉన్నాయి. పరిశీలించగా ఆలయంలో పెద్దమ్మ, పెద్దిరాజు ఉత్సవ విగ్రహాలు కనిపించలేదు. గ్రామస్థుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఆలయంలోని బంగారు ఆభరణాలను మాత్రం దుండగులు అక్కడే వదిలి వెళ్లారు.

నియంత్రిక ధ్వంసం.. రాగి తీగతో పరారీ

చేర్యాల: కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నియంత్రికను ధ్వంసం చేసి అందులోని రాగితీగ, నూనె ఎత్తుకెళ్లారని కొమురవెల్లి ఎస్సై రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఐనాపూర్ జూనియర్ లైన్‌మెన్ ప్రవీణ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రాగి తీగ, నూనె విలువ సుమారు రూ. 20వేలు ఉంటుందని చెప్పారు.

చేర్యాలలో 'లవ్‌రెడ్డి' చిత్ర బృందం సందడి



దర్శకుడు స్మరన్‌రెడ్డితో చిత్ర బృందం

చేర్యాల, న్యూస్‌టుడే: 'లవ్‌రెడ్డి' చిత్ర బృందం శుక్రవారం చేర్యాలలో సందడి చేసింది. స్థానికుడైన చిత్ర దర్శకుడు స్మరన్ రెడ్డితో పాటు చిత్ర బృందం సభ్యులకు యూత్ ప్రతినిధి రావుల ఉమేశ్ ఆధ్వర్యంలో యువకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుర ఉపాధ్యక్షుడు నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి దర్శకుడిని సన్మానించారు. జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి దర్శకుడికి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: బల్దియా పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నామని బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. దరఖాస్తులను వేగవంతం చేయడానికి గతంలో నాలుగు లాగిన్‌లు ఉండగా, నూతనంగా 29 లాగిన్లను ఏర్పాటు చేయించామన్నారు. ఈ మేరకు బల్దియా కార్యాలయంలో శుక్రవారం ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బల్దియా పరిధిలో 32,533 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. లాగిన్‌లు పొందిన వారు ఒక్కొక్కరుగా 1,000 దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రక్రియ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బల్దియా అధికారులు వందనం, నస్రీన్‌భాను, స్రవంతి తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మహ్మదాపూర్‌లో పిట్టల రాములు, అక్కన్నపేట మండలం నందారంలో మాజీ ఉపసర్పంచి కొట్టె శ్రీనివాస్ కుమారుడు సుధాకర్, పోతారం(జె)లో శిక తిరుపతి కుమార్తె కీర్తన్య ఇటీవల మృతి చెందారు. మృతుల చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.